క్లుప్తంగా

ఏయూ సహకార సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగుల సహకార సంఘం క్యాలెండర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ కార్యవర్గ సభ్యులతో మాట్లాడారు, సంస్థ స్వయం సమృద్ధి సాధించే దిశగా ప్రణాళిక చేయాలని సూచించారు. వర్సిటీ పరంగా సొసైటీ అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ఎ.పల్లవి, రెక్టార్ కె.సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాబా, సంయుక్త కార్యదర్శి సీహెచ్ లక్ష్మణ బాబు, డైరెక్టర్లు డాక్టర్ ఎస్.ఎం యుగంధర్, దువ్వి గోవింద్ సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కప్పేసిన పొగమంచు దుప్పటి



హనుమంతవాక కూడలిలో పొగమంచు

ఏయూ క్యాంపస్: నగరంలో పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటల వరకు పలు ప్రాంతాల్లో భారీగా మంచు కురవడం కనిపించింది. వెంకోజీపాలెం నుంచి హనుమంతవాక వెళ్లే మార్గంలో రెండు కొండలకు మధ్యన, బీఆర్‌టీఎస్ రహదారిలో భారీగా పొగమంచు దర్శనమిచ్చింది. సింహాచలం పాత గోశాల నుంచి వేపగుంటకు వెళ్లే మార్గంలో, వేపగుంట నుంచి పెందుర్తి వెళ్లే మార్గంలో భారీగా మంచు కమ్మేసింది. ఎదురుగా వెళ్తున్న, ముందున్న వాహనాలను సైతం గుర్తించలేని పరిస్థితి కనిపించింది. వాహనదారులు వాహనాల లైట్లు వేసుకుని ప్రయాణించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



కొత్త వెంకోజీపాలెంలో ముగ్గుల పోటీల్లో మహిళలు

మద్దిలపాలెం: భోగి పండగ సందర్భంగా శనివారం కొత్త వెంకోజీపాలెంలో షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు చక్కని రంగవల్లులు వేసి ప్రతిభ ప్రదర్శించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

నాలుగో రోజు.. 72 కచేరీలు

కొనసాగుతున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలు



త్యాగరాజ కృతులతో శ్రావ్యంగా కచేరీ

మద్దిలపాలెం: త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం 72 కచేరీలు నిర్వహించామని డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న ఉత్సవాల్లో 198 మంది కళాకారులు పాల్గొన్నారు. రాజమండ్రికి చెందిన అయ్యగారి సత్యప్రసాద్ వీణా కచేరీ వీనులవిందుగా సాగింది. పంతుల రమ గాత్ర కచేరీ అందరినీ అలరించింది.

ఆకాశంలో మీనాలై.. చేతికందే పక్షులై..





ఆకాశంలో మీనాలు సంచరిస్తున్నట్లు.. చేతికందే ఎత్తులో గరుడపక్షి రెక్కలు విప్పి ఎగురుతున్నట్లు .. బార్బీ డాల్ గాలిలో నడుస్తున్నట్లుగా.. కనికట్టు చేసిన మాదిరిగా దర్శనమిచ్చింది సాగరతీరం. సమీపానికి వచ్చి చూస్తే తెలియాదే గాలిపటాలు సరదాగా స్వాగతించాయి. దీంతో 'చిలుకా పదపద.. నెమలీ పద పద ' అంటూ చిన్నారులు, యువతీయువకులు పతంగులతో పోటీ పడుతూ పరుగులు తీశారు. ఇలా.. బీచ్‌లో పతంగుల పండగ శనివారం సందడిగా సాగింది. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు తీరంలో పతంగులతో నగరవాసులు శనివారం సందడి చేశారు. - బీచ్‌రోడ్డు



వర్మీ కంపోస్టుకు భలే డిమాండ్

- ఎంవీపీ రైతుబజార్‌లో తయారీ
- అక్కడే ఓ స్టాల్‌లో విక్రయాలు
- భారీగా కొనుగోలు చేస్తున్న నగరవాసులు



రైతు బజార్‌లో ప్యాకెట్లతో విక్రయిస్తున్న సేంద్రియ ఎరువుల స్టాల్



ఎంవీపీ రైతు బజార్‌లో వర్మీ కంపోస్టు ఎరువు తయారీ కేంద్రం

ఆరిలోవ: ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంలో భాగంగా ఇటీవల ఎక్కువ మంది ఇళ్ల వద్దే కూరగాయలు పండించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఇంటి పంటలు పెరిగాయి. అన్ని రకాల కూరగాయలతోపాటు వివిధ రకాల పూల మొక్కలు కూడా ఇంటి ముందు, టెర్రస్‌పై పండిస్తున్నారు. రసాయన ఎరువులు వాడకం పూర్తిగా తగ్గించి కంపోస్టు ఎరువులు వాడుతున్నారు. దీంతో కంపోస్టు ఎరువులకు డిమాండ్ పెరిగింది. ఈ ఎరువులు మార్కెట్‌లో అందుబాటులో ఉండటం లేదు. దీంతో వినియోగదారుల సౌలభ్యం కోసం రైతు బజార్లలోనే కంపోస్టు ఎరువులు తయారీ చేస్తున్నారు. నగరంలోని ఎంవీపీ రైతు బజార్‌లో రెండు దశాబ్దాల కిందట వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసే కేంద్రం నిర్మించారు. ఇటీవల కంపోస్టు ఎరువు విక్రయ స్టాల్ కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడే ఎరువు తయారుచేసి, దాన్ని ప్యాకెట్లలో కిలోల చొప్పున వినియోగదారులకు విక్రయిస్తున్నారు. నగరంలో ఇక్కడ ఒక్కచోటే విక్రయిస్తుండడంతో ఈ ఎరువుకు డిమాండ్ బాగా పెరిగింది.

2001లో ప్రారంభం...

రైతులకు, ఇంటి పంటలు పండించే వారికి సేంద్రియ ఎరువులు అందుబాటులో ఉంచాలనే ఆలోచనతో మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుబజార్లలో కూరగాయల వ్యర్థాలతో ఎరువు తయారు చేయదలిచారు. ఇందులో భాగంగా 2001లో ఎంవీపీ రైతు బజార్‌లో సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇక్కడ రేకుల షెడ్ నిర్మించి పెద్ద గోనె సంచుల్లో ఎరువు తయారు చేసేవారు. ఈ షెడ్‌లు 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపాన్ దాటికి ఎగిరిపోయి శిథిలమయ్యాయి. అప్పటి నుంచి మూలకు చేరిన ఈ విధానం మళ్లీ ఇటీవల అందుబాటులోకి వచ్చింది. నాలుగేళ్ల క్రితం ఇక్కడ పక్కాగా షెడ్లు నిర్మించారు. సిమెంట్ కుండలు నిర్మించి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. తయారైన ఎరువుని రైతు బజార్‌లోనే ఏర్పాటు చేసిన ఓ స్టాల్‌లో ప్యాకెట్లులో వేసి కిలో, రెండు కిలోలు చొప్పున విక్రయాలు జరుపుతున్నారు.

స్టాళ్ల నుంచి వ్యర్థాలు సేకరించి తయారీ

ఎంవీపీ రైతు బజార్‌లో అనన్య వర్మీ టెక్ అండ్ వర్మీ కల్చ్ నిర్వాహకులు ఎరువు తయారు చేస్తున్నారు. బజారులో 178 స్టాల్స్ ఉన్నాయి. వీటిలో కూరగాయలు, పండ్లుతోపాటు కిరాణా సరకులూ విక్రయిస్తారు. రోజూ ఆయా స్టాళ్లలో విక్రయించగా పాడైన, విక్రయానికి పనికిరాని వ్యర్థాలను పక్కన పడేస్తారు. వాటిని సేకరించి డీ కంపోజ్ తొట్టి (సిమెంట్ కుండీ)లో వేసి 45 రోజులపాటు నిల్వ ఉంచుతారు. అనంతరం ముద్దగా మారినదాన్ని వేరే కుండీలోకి మార్చుతారు. అందులో వానపాములు విడిచిపెట్టి నెల రోజులు ఉంచుతారు. దానికి గాలి తగిలి తడి ఆరిపోయి పొడిగా మారుతుంది. ఆ పొడిని జల్లించి ఎరువు సిద్ధం చేస్తారు. ఆ ఎరువును ప్యాకెట్లలో వేసి విక్రయిస్తున్నారు. సుమారు రెండు నెలలకు పైగా వ్యవధిలో మూడు టన్నులు ఎరువు ఇక్కడ తయారవుతోంది.

రెండు నెలల్లో తయారీ



ఈ విధానంలో వర్మీ కంపోస్టు ఎరువు తయారీ కావడానికి సుమారు రెండు నెలలకు పైగా సమయం పడుతుంది. ఇక్కడ కిలో, రెండు కిలోల ప్యాకెట్లు విక్రయిస్తున్నాం. నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల నుంచి కొందరు రైతులు కూడా వచ్చి ఎరువు కొనుగోలు చేస్తున్నారు. ఒకసారికి మూడు టన్నులు ఎరువు తయారవుతుంది. కూరగాయలు, పూల మొక్కలకు దీన్ని ఉపయోగించవచ్చు.

–ఎస్.వెంకట శివరామకృష్ణ, ఎరువు ఉత్పత్తిదారుడు

పెరిగిన విక్రయాలు



నగరంలో ఇటీవల ఎక్కువగా ఇంటి పంటలు పండిస్తున్నారు. ఇంటి ముందు, టెర్రస్‌పై కూరగాయలు, పూల మొక్కలు ఎక్కువగా పండిస్తున్నారు. వాటికి రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులు మేలని నగరవాసులు గుర్తిస్తున్నారు. అందుకే ఎక్కువమంది ఇక్కడ తయారైన వర్మీ కంపోస్టు ఎరువు కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి ఎరువు వాడటం వల్ల కలుషితం లేని కూరగాయలు ఉత్పత్తి అవుతున్నాయి. అలాంటి కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

–గోకాడ ప్రసాద్, ఈవో, ఎంవీపీ రైతు బజార్

బ్రేక్ డ్యాన్స్ నేషనల్ చాంపియన్‌గా చైతన్య



ధ్రువపత్రాన్ని అందుకుంటున్న చైతన్య

సీతంపేట: నేషనల్ లెవెల్ బ్రేక్ డ్యాన్స్ పోటీలో అక్కయ్యపాలేనికి చెందిన పెంటకోట చైతన్య అద్భుత ప్రతిభతో విన్నర్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. చెన్నైలోని ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన జాతీయ స్థాయి ఒరిజినల్ స్ట్రీట్ డ్యాన్స్ పోటీల్లో అండర్ 16 స్థాయిలో 30 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం నుంచి పాల్గొన్న చైతన్య మొదటి స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌ను సాధించాడు. 2018లో మొదటి సారి పోటీల్లో అడుగుపెట్టిన చైతన్య ఐదేళ్ల కఠోర శిక్షణ తర్వాత నేషనల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్నాడు. ఎంవీపీలోని డిస్నీ బ్రేకర్స్ ఇంటర్నేషనల్ డ్యాన్స్ స్కూల్‌లో సోహైల్ సింగ్ వద్ద బ్రేకింగ్ డ్యాన్స్‌లో శిక్షణ పొందుతున్నాడు.

మరో సైబర్ క్రైం

బాధితుడి ఖాతా నుంచి రూ. 1.62 లక్షలు మాయం

అల్లిపురం: అప్పు తీసుకుని పూర్తిగా తీర్చేసినా లోన్ యాప్ ద్వారా సదరు వ్యక్తిని దోచుకున్న మరో ఘటన విశాఖలో చోటు చేసుకుంది. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన వ్యక్తి సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం పెకిఫర్ లోన్ యాప్ నుంచి డబ్బు తీసుకున్నాడు. కాలపరిమితిలోగా ఆ అప్పును తీర్చేసాడు కూడా. అయినప్పటికీ ఆ కంపెనీ నుంచి ముకేష్ అనే వ్యక్తి ఫోన్ చేసి డిసెంబర్ ఈఎంఐ బ్యాలెన్స్ వుందని.. డబ్బు కట్టాలని చెప్పాడు. తాను ఇది వరకే ఈఎంఐ చెల్లించానని సదరు వ్యక్తి చెప్పాడు. మీరు చెల్లించింది అప్‌డేట్ కాలేదని, ఫోన్ పేలోకి వెళ్లి యూపీఐ నంబర్‌కి తాము చెప్పిన కోడ్ ఎంటర్ చేయమని లోన్‌యాప్ వ్యక్తి తెలిపాడు. బాధితుడు అతను చెప్పిన నంబరు ఎంటర్ చేశాడు. అంతే.. బాధితుడి అకౌంట్ నుంచి రూ.1,62,821 మాయమైపోయాయి. దీంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

అప్రమత్తంగా ఉండండి..

లోన్ యాప్ ఆగడాలు మళ్ళీ విజృంభిస్తున్నందున ఎవరూ ఆన్‌లైన్ లోన్లు తీసుకోవద్దని సైబర్ క్రైం సీఐ భవానీప్రసాద్ తెలిపారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ళ బారిన పడినట్లు అయితే తక్షణమే www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930లో గాని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు 9490617917 నంబర్‌లో గానీ ఫిర్యాదు చేయాలని తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో కర్పూర జ్యోతి



కర్పూరదీపాన్ని వదులుతున్న భక్తులు



పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఏయూక్యాంపస్: చినగదిలి సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి మందిరంలో శనివారం కర్పూర జ్యోతిని వెలిగించారు. శబరిమలలో మకర జ్యోతికి నీరాజనంగా కర్పూర జ్యోతిని వెలిగించి, నింగిలోకి పంపించారు. విజయగణపతి అయ్యప్ప ట్రస్ట్ ఏగిరెడ్డి శ్రీనివాస్ దంపతులు, ట్రస్ట్ చైర్మన్ వానపల్లి అప్పారావు దంపతులు, ట్రస్ట్ సభ్యులు అయ్యప్ప పూజా కార్యక్రమం జరిపిన అనంతరం కర్పూర దీపాన్ని నింగిలోకి విడిచిపెట్టారు.

బహుమతుల ప్రదానం

సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని పి.సావిత్రి, రెండో బహుమతిని జులాది, మూడవ బహుమతిని కె.లక్ష్మి గెలుచుకోగా.. ప్రోత్సాహక బహుమతులను జె.అరుణ, గీత అందుకున్నారు. అనంతరం పడి పూజ వైభవంగా జరిగింది

రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ నుంచి శనివారం రాత్రి బయలుదేరాల్సిన పలు రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆయా స్టేషన్ల నుంచి పెయిరింగ్ రైళ్లు విశాఖకు ఆలస్యంగా రావడంతో రీషెడ్యూల్ చేశామన్నారు.

- శనివారం రాత్రి 10 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ ఆదివారం తెల్లవారు 3 గంటలకు బయలుదేరింది.
- శనివారం రాత్రి 11.25 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మధ్య రాత్రి 1 గంటకు బయలుదేరింది.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు..

సికింద్రాబాద్ డివిజన్ సులేహల్లి స్టేషన్ పరిధిలో గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కారణంగా శనివారం మధ్య రాత్రి విశాఖలో బయలుదేరే విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో వయా వాడి, కాలాబురాగి, హోమ్నబడ్, బీదర్, వికారాబాద్ స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

వైభవంగా గోదా కల్యాణం



గోదా కల్యాణం వీక్షిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో గోదాదేవి సహిత శ్రీవారు

ఎంవీపీకాలనీ: గోదారంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా జరిపించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణం కనులపండువగా జరిగింది. గోదాదేవి సహిత శ్రీవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. కల్యాణమహోత్సవం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. 60 మంది దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు.

17వ వార్డులో..

జీవీఎంసీ 17వ వార్డు కొత్త వెంకోజీపాలెంలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుడు రామ్ కిషోర్ ఆచార్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం, కస్తూర్బా, కిరణ్మయి మహిళామండలి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని, పూజలు చేశారు.

మద్దిలపాలెం: ధనుర్మాస ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజైన శనివారం శ్రీగోదాదేవి రంగనాథ స్వాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండవగా జరిపారు. కేఆర్ఎం కాలనీలో త్రిముఖ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **ఏయూ క్యాంపస్:** వాడవాడలా భోగి పండగను చిన్నపెద్ద కలిసి జరుపుకున్నారు. వీధుల్లో భోగి మంటలు వేసుకుని తెల్లవారుజాము నుంచి సందడి చేశారు. పండుగ రోజుల్లో కనిపించే బసవన్నలను పట్టుకుని గంగిరెద్దుల వారు వీధుల్లో దర్శనమిచ్చారు. ప్రజలు ఇచ్చిన దక్షిణ, దుస్తులు తీసుకుని ఆశీస్సులు అందించారు. సన్నాయిని శ్రావ్యంగా పలికిస్తూ డూడు బసవన్నను ఆడిస్తూ వీధుల్లోకి పండగ శోభ తీసుకొచ్చారు. మహిళలు బసవన్నకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు.

మద్దిలపాలెం: మద్దిలపాలెంలో భోగి పండగ శనివారం ఘనంగా నిర్వహించారు.

ఆలయాల్లో పండగ శోభ

పెదవాల్తేరులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం కన్నుల పండవగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని వీక్షించారు. పురోహితులు వేదమంత్రోచ్చారణలతో ఆలయం శోభిల్లింది. పండగను పురస్కరించుకుని ఈస్ట్ షిర్డీ ఆలయం, పోలమాంబ ఆలయాలను సైతం సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లి ఆశీస్సులు తీసుకున్నారు. దేవాలయాల్లో సంప్రదాయ వస్త్రధారణతో పండగను ఘనంగా జరుపుకొన్నారు.



బసవన్న సందడి



కల్యాణ మహోత్సవంలో పాల్గొన భక్తులు

పోలమాంబ ఆలయంలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

ఎంవీపీకాలనీ: కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో శనివారం రంగోలీ, గొబ్బెమ్మలు, గంగిరెద్దు ప్రదర్శనలను నిర్వహించారు. సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం అయిన పోలమాంబ అమ్మవారిని తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ బాబా మాట్లాడుతూ ఈ నెల 18న వార్షిక పరస మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ పువ్వులకు గిరాకీ



పువ్వులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఏయూక్యాంపస్: పండగల నేపథ్యంలో పువ్వులకు గిరాకీ పెరిగింది. పండగ మూడు రోజులు ఆలయాలలో అలంకరణకు, ఇంట్లో వినియోగానికి, అలంకరణకు అవసరమైన పుష్పాలను వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. పెదవాల్తేరు రైతు బజార్‌లో శనివారం కూరగాయల దుకాణాలతో పాటు పువ్వుల దుకాణాలు కళకళలాడాయి. వినియోగదారులతో సందడిగా మారాయి. చామంతి హైబ్రిడ్ కేజీ రూ. 280, హైబ్రిడ్ గులాబీ కేజీ రూ.300, బంతి పువ్వుల దండలు రూ. 30 నుంచి రూ. 35, కనకాంబరాలు మూర రూ. 50, విరజాజులు మూర రూ.30 చొప్పున కేజీ రూ.200, కాగడ మల్లి మూడు రూ.40 కి విక్రయించారు. మందారం, తులసి మాలలు, నందివర్ధనం పువ్వులు రైతు బజార్లలో విరివిగా విక్రయించారు.

గోదాదేవి వేషధారణలో చిన్నారులు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు,యువత

సింహాచలం: సింహగిరిపై స్వధర్మ వాహిని ఆధ్వర్యంలో శనివారం ఆలయ రాజగోపురం వద్ద ఉన్న కళావేదికపై గోదాదేవి అలంకరణ పోటీలు నిర్వహించారు. చిన్నారులు, యువతులు గోదాదేవి అలంకరణలో ఆకట్టుకున్నారు. విజేతలకు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ నగదు బహుమతులు అందజేశారు. సింహగిరిపై నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు బహుమతులు అందజేశారు. ఎస్ఏడీ కొత్త రోడ్డుకి చెందిన కె.నాగమణి ప్రథమ బహుమతి పొందగా, శ్రీనివాసనగర్‌కు చెందిన కె.సౌమ్య, మద్దిలపాలేనికి చెందిన ఎస్.సువర్ణ ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచారు. భక్తులకు సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఆధ్వర్యంలో బూరెలు పంపిణీ చేశారు.